ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5
జయశంకర్ భూపాలపల్లి
ములుగు
సోమవారం 29 జనవరి 2024



జంపన్నవాగులో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు





మేడారంలో భక్తజన సందోహం

- జాతరకు ముందే కోలాహలం
- కిక్కిరిసిన వనదేవతల గద్దెలు
- సమ్మక్క సారలమ్మలను దర్శించుకున్న సుమారు 4 లక్షల మంది
- మొక్కులు చెల్లించుకున్న ప్రముఖులు

మేడారం, జనవరి 28 : తాడ్వాయి మండలంలోని వనదేవతల సన్నిధి మేడారం కిటకిటలాడింది. సమక్క, సారలమ్మలను దర్శించుకోవడానికి భక్తజనం భారీగా తరలివచ్చారు. మహాజాతర ఫిబ్రవరి 21 నుంచి జరగనుండగా ముందస్తుగానే తల్లులకు మొక్కులు చెల్లించుకున్నారు. వారాంత సెలవు కావడంతో భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. సుమారు 4 లక్షల మంది వనదేవతలను దర్శించుకున్నారని దేవాదాయ శాఖ ఈవో రాజేంద్రం తెలిపారు.

మేడారం చేరుకున్న భక్తులు ముందుగా జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించారు. కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. శివసత్తుల పూనకాలు, డోలు వాయిద్యాల మధ్య సమ్మక్క, సారలమ్మ నామాన్ని జపిస్తూ క్యూలైన్ల ద్వారా తల్లుల గద్దెలకు చేరుకున్నారు. పసుపు, కుంకుమ, పూలు, పండ్లు, చీరె సారెలు, కొబ్బరి కాయలు, నిలువెత్తు బంగారం(బెల్లం) సమర్పించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. కోరికలు తీర్చాలని అమ్మవార్లను వేడుకున్నారు. బలి మొక్కులు సమర్పించి మేడారం పరిసరాల్లో చెట్లకింద వంటలు చేసుకొని బంధుమిత్రులతో విందు భోజనాలు చేశారు.

తల్లులను దర్శించుకున్న ప్రముఖులు

వనదేవతలను తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి రాజేశ్వర్‌రావు, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, సీసీఎల్‌ఏ జాయింట్ సెక్రటరీ సవిత, యాదాద్రి అదనపు కలెక్టర్ శ్రీనివాస్, సీఎం పీఆర్వో శ్రీనివాస్, ఇరిగేషన్ ఎస్ఈ విజయభాస్కర్, గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ ఈఈ హేమలత దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల అనంతరం తల్లుల ప్రసాదాలను పూజారులు వారికి అందజేశారు. కండువాలతో సత్కరించారు.

పర్యవేక్షించిన కలెక్టర్

భక్తులు భారీ సంఖ్యలో తరలిరావడంతో మేడారంలోని జంపన్నవాగు, కల్యాణ కట్టలు, తల్లుల గద్దెలు, దేవస్థానం ప్రాంగణం, ఇతర పరిసరాలు రద్దీగా మారాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లను కలెక్టర్ ఇలా త్రిపాఠి పర్యవేక్షించారు. వివిధ ప్రాంతాల నుంచి వందల సంఖ్యలో వాహనాలు రావడంతో కొద్దిసేపు ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. ట్రాఫిక్‌ను పోలీసులు ఎప్పటికప్పుడు క్లియర్ చేయడంపై ప్రత్యేక దృష్టిపెట్టాలని ఎస్పీ శబరీశ్‌తో అన్నారు. ముందస్తు మొక్కులు చెల్లించుకోవడానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వస్తున్నారని, వారికి సౌకార్యలతో పాటు భద్రత కలిపించాలని అన్నారు.

గద్దెల సమీపంలో వాహనాల పార్కింగ్

మహా జాతరకు తరలివచ్చే భక్తులు తమ వాహనాలను గద్దెల సమీపంలో పార్కింగ్ చేసుకునేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని ఎస్పీ శబరీశ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వాహనాల కోసం కొత్తగా పార్కింగ్ స్థలాలను గుర్తించినట్టు పేర్కొన్నారు. భక్తులను దేవతల గద్దెల దగ్గర వరకు సులభంగా చేర్చడమే తమ ముఖ్యోద్దేశమని తెలిపారు. దానికి అనుగుణంగా ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టామని వివరించారు. పస్రా మీదుగా మేడారం వచ్చే వాహనాల రాకపోకలపై ట్రాఫిక్ ఆంక్షలు విధించామని తెలిపారు. వాహనాలను ఓవర్‌టేక్ చేయొద్దని, రోడ్డుకు ఇరువైపులా ఎట్టి పరిస్థితుల్లోనూ నిలిపివేయొద్దని సూచించారు. కేటాయించిన స్థలాల్లోనే వాహనాలను పార్క్ చేయాలని పేర్కొన్నారు. భక్తులు పోలీసులకు సహకరించాలని కోరారు.



వనదేవతలకు మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



గంట కొడుతున్న పరకాల ఎమ్మెల్యే రేవూరి

కాళేశ్వరంలో భక్తుల రద్దీ

మహదేవపూర్, జనవరి 28: మండలంలోని కాళేశ్వరంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వారాంత సెలవు కావడంతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఫిబ్రవరిలో మేడారం మహాజాతర జరగనుండగా మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన భక్తులు అక్కడికి భారీ సంఖ్యలో వెళ్తూ ముందస్తు వనదేవతలను దర్శించుకున్నారు. కాళేశ్వరం మీదుగా వెళ్తూ ముక్తీశ్వరాలయాన్ని సందర్శించారు. ముందుగా కాళేశ్వరం గోదావరిలో స్నానాలు ఆచరించి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. దీంతో ఆలయానికి భారీగా ఆదాయం సమకూరింది.



కాళేశ్వరం గోదావరి వద్ద భక్తులు

రామప్ప ఆలయంలో సందడి



రామలింగేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు, పర్యాటకులు

వెంకటాపూర్(రామప్ప), జనవరి 28: మండలంలోని యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయంలో సందడి నెలకొంది. ఆదివారం సెలవురోజు కావడంతో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు, పర్యాటకులు పెద్దసంఖ్యలో చేరుకున్నారు. రామలింగేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుల నుంచి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయానికి తూర్పు ముఖద్వారాన ఉన్న నందీశ్వరుడి చుట్టూ ప్రదక్షిణలు చేసి కొబ్బరికాయలు కొట్టారు. కాకతీయుల నాటి శిల్పకళా సంపదను వీక్షించారు. ఆలయ విశిష్టత, చరిత్ర గురించి గైడ్‌ల ద్వారా తెలుసుకుని మంత్రముగ్ధులయ్యారు. అనంతరం సరస్సు వద్దకు చేరుకుని బోటులో షికారు చేస్తూ ఆనందంగా గడిపారు.



జిల్లా కలెక్టర్, ఎస్పీ అధికారులతో సమావేశమైన మంత్రి సీతక్క

పనుల్లో వేగం పెంచండి

- మహాజాతర సమయం దగ్గర పడుతోంది..
- జాప్యం చేయకుండా సకాలంలో పూర్తి చేయండి
- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ సీతక్క
- మేడారంలో అధికారులతో సమీక్ష

మేడారం, జనవరి 28: మహాజాతర సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో మేడారంలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. జాతరకు సమయం దగ్గరపడుతున్నా కొద్దీ భక్తుల రాక పెరుగుతోందని, వారికి మౌలిక సౌకర్యాలు కల్పించాలని అన్నారు. మంత్రి సీతక్క ఆదివారం రాత్రి 9 గంటల తర్వాత పర్యటించారు. పోలీసు కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శబరీశ్, ఐటీడీఏ పీవో అంకిత్, అదనపు కలెక్టర్ శ్రీజ, ఆయా శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ప్రధానంగా అంతర్గత, లింకు రోడ్ల పనులు కొనసాగుతుండటం వల్ల ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోందని, భక్తులు కూడా అసౌకర్యానికి గురవుతున్నారని సీతక్క అన్నారు. నాణ్యతలో రాజీ పడకుండా వారంలోగా రోడ్ల పనులన్నింటినీ పూర్తి చేయాలని ఆర్అండ్‌బీ, పీఆర్ అధికారులకు సూచించారు. జంపన్నవాగులో భక్తుల పుణ్యస్నానాల కోసం సౌకర్యాలను విస్తరించాలని, సాధ్యమైనన్ని ఎక్కువ బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్ అందుబాటులోకి తేవాలని అన్నారు. తాగునీటి సరఫరా, పారిశుధ్యం విషయంలో అలసత్వం వహించొద్దని, వీలైనన్ని ఎక్కువ ప్రాంతాల్లో సౌకర్యాలు కల్పించాలని అన్నారు. ఈ సమీక్షలో ఏటూరునాగారం ఏఎస్పీ సంకీర్త్, ఆర్అండ్‌బీ ఈఈ వెంకటేశ్, పీఆర్ ఈఈ జయంత్ తదితరులు పాల్గొన్నారు.

భక్తుల విడిది షెడ్లను ప్రారంభించిన మంత్రి



చల్వాయిలో విడిది షెడ్డును ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క

గోవిందరావుపేట/తాడ్వాయి: మేడారం భక్తుల కోసం గోవిందరావుపేట మండలం చల్వాయి, తాడ్వాయి మండల కేంద్రాలలో రూ.కోటి 50లక్షల చొప్పున వ్యయంతో నిర్మించిన విడిది షెడ్లను రాష్ట్ర మంత్రి సీతక్క ఆదివారం ప్రారంభించారు. గోవిందరావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రసవం కోసం వచ్చిన గర్భిణుల కోసం నిర్మించిన గదిని ప్రారంభించారు. అదే విధంగా దుంపెల్లిగూడెంలో రూ.20 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనానికి ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమాలలో ఐటీడీఏ పీవో అంకిత్, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రెండు పంటలకు సాగునీరు అందిస్తాం

ములుగు కలెక్టరేట్ : అన్ని గ్రామాల కలయికనే రాయినిగూడెం గ్రామమని, ఈప్రాంతంలో రెండు పంటలకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తానని మంత్రి ధనసరి సీతక్క అన్నారు. ఆదివారం ములుగు మంలంలోని రాయినిగూడెం గ్రామంలో లోతట్టు గ్రామాల్లో మంత్రిని పలువురు సన్మానించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు జోడెడ్ల వలే పనిచేస్తూ ప్రజలను బండిలో కూర్చోబెట్టి అభివృద్ధి వైపు తీసుకెళ్లాలని అన్నారు. అదేవిధంగా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ప్రజలు తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి.శ్రీజ, జడ్పీ సీఈవో ప్రసూనరాణి, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డితోపాటు లోతట్టు గ్రామాల సర్పంచ్‌లు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడా వెంకట్‌రెడ్డి

గుడిసె వాసులకు పట్టాలివ్వాలి

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడా వెంకట్‌రెడ్డి

కాకతీయఖని, జనవరి 28: ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకున్న పేదలకు పట్టాలు జారీ చేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడా వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. భూపాలపల్లి పట్టణంలోని సర్వ నంబరు 280లో పేదలు గుడిసెలు వేసుకుని ఆదివారం నాటికి ఏడాది పూర్తయిన సందర్భంగా కాలనీని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వం పేదలకు ఇచ్చిన అనేక హామీలను విస్మరించిందని విమర్శించారు. అందుకు ప్రతిఫలంగా ఓటమిని చవిచూసిందని వ్యాఖ్యానించారు. నిరంకుశ పాలనకు ప్రజలు చరమగీతం పాడారని, ప్రగతి భవన్‌కు వేసిన కంచెను తొలగించి ప్రజలు స్వేచ్ఛావాయువులను పీల్చుకుంటునారని అన్నారు. కొత్తగా అధికారంలోకి కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీ హామీలను నెరవేర్చాలని కోరారు. సర్వేనంబర్ 280 భూమిలో గుడిసెలు వేసుకున్న వారికి పట్టాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తీసుకెళ్లి పరిష్కరించాలన్నారు. అలాగే కాలనీలో రోడ్లు వేయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్య దర్శివర్గ సభ్యుడు తక్కళ్లపెల్లి శ్రీనివాసరావు, భూపాలపల్లి జిల్లా కార్య దర్శి రాజ్‌కుమార్, నాయకులు అశోక్, ప్రవీణ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పాలెం ప్రాజెక్టు కాల్వలో బాలుడి మృతి



మన్విత్ (ఫైల్)

వెంకటాపురం(నూగూరు), జనవరి 28: ములుగు జిల్లా వెంకటాపురం (నూగూరు) మండలంలో ఆదివారం విషాదం చోటుచేసుకుంది. ఒంటిమామిడి గ్రామంలోని పాలెం ప్రాజెక్టు కాల్వలో పడి ఓ బాలుడు మృతి చెందాడు. గొత్తికోయ తెగకు చెందిన శ్యామల రాధ, రామకృష్ణ దంపతులు కొన్నేళ్ల క్రితం వలస వచ్చి గ్రామంలో కూలిపనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. వీరి కుమారుడు మన్విత్ (2) ఉదయం తోటి చిన్నారులతో కలిసి ఆడుకుంటూ రోడ్డు దాటి ఇంటి దగ్గరలోని పాలెం ప్రాజెక్టు కాల్వ వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు కాల్వలో పడి మృతి చెందాడు. బాలుడి కోసం తల్లిదండ్రులు ప్రతి ఇంటినీ వెతకగా ఎక్కడా కనిపించలేదు. కాల్వ వద్దకు వెళ్లి చూడగా మన్విత్ విగత జీవిగా అందులో పడి ఉన్నాడు.

ప్రయాణం.. ప్రాణ సంకటం

- ప్రమాదకరంగా జాతీయ రహదారి
- భయాందోళన కలిగిస్తున్న ఇసుక లారీలు
- నెత్తురోడుతున్న రోడ్డు

ఏటూరునాగారం, జనవరి 28 : జాతీయ రహదారి-163 ప్రమాదకరంగా మారింది. రోజురోజుకూ ఇసుక లారీల రద్దీ పెరుగుతుండటం డేంజర్ బెల్లులు మోగిస్తోంది. రేయింబవళ్లు భారీ లోడుతో ఇసుక లారీలు నడుస్తుండడం ప్రాణసంకటంగా మారింది. ముఖ్యంగా మేడారానికి వచ్చిపోయే భక్తులు, ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలలో ప్రయాణిస్తున్న ప్రయాణికులు, డ్రైవర్లను భయాందోళన కలిగిస్తోంది. మేడారం సమ్మక్క, సరలమ్మలను దర్శించుకునేందుకు వివిధ రాష్ట్రాల నుంచి టూరిస్ట్ బస్సులు, కార్లు, తదితర ప్రైవేటు వాహనాల్లో వేలాది మంది భక్తులు మేడారానికి తరలివెళ్తున్నారు. ములుగు జిలాలోని వాజేడు, వెంకటాపురం(నూగూరు) మండలాల నుంచి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి ఇసుక లారీల రవాణా నిరంతరం సాగుతోంది. జిల్లాలోని వాజేడు మండలం బాసునపల్లి, అమ్మవారిపేట, ధర్మవరం, వెంకటాపురం(నూగూరు) మండలం వీరభద్రారం, సురవీడు, ఎదిర, అలుబాక, బొదాపురం తదితర ప్రాంతాల్లో ఇసుక క్వారీలు నడుస్తున్నాయి. ఈ క్వారీల నుంచి లారీలు అతివేగంగా, అధికలోడుతో వెళ్తండడంతో ప్రధాన జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది.

భద్రాది కొత్తగూడెం జిల్లాతోపాటు వెంకటాపురం(నూగూరు), వాజేడు మండలాల నుంచి రాత్రి వేళలో గోదావరి తీరం నుంచి ఎలాంటి అనుమతి లేకాండా ఇసుకను తరలించడానికి ఏటూరునాగారంలోని వైజంక్షన్, క్రాస్ రోడ్డులోని పోలీసు స్టేషన్, ఐటీడీఏ పీవో గెస్ట్ హౌస్ వద్ద లారీలను నిలుపుతున్నారు. దీంతో రాత్రివేళల్లో ఎవరూ లేని సమయంలో లారీల్లో ఇసుకను పట్టణాలకు తరలిస్తున్నారు. నవంబరు 25న వాజేడు మండలం ధర్మారం క్వారీ నుంచి ఇసుక లోడుతో ఏటూరునాగారం మీదుగా హనుమకొండ వైపు వెళ్తున్న లారీ మండల కేంద్రంలోని క్రాస్ రోడ్డు అటవీ శాఖ చెక్ పోస్టు వద్ద కారును ఢీకొంది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా ఆవుపల్లి గ్రామానికి చెందిన కారం సుమన్(23) అనే వ్యక్తి కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి మేడారం సమ్మక్క, సారలమ్మల దర్శనానికి వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్తున్న క్రమంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. దీంతో సుమన్ అక్కడికక్కడే మృతి చెందాడు. అదే నెల 15న ఇసుక లారీ అతివేగంగా, అధికలోడుతో వెళ్తున్న లారీ ఏటూరునాగారం మండలం చిన్నబోయినపల్లి సమీపంలోకి లారీ చేరుకోగానే అదుపుతప్పి చెట్టును ఢీకొంది. దీంతో లారీ క్యాబిన్‌లోనే ఇరుక్కొని నరకయాతన పడి మంగపేట మండలం కోమటిపల్లి గ్రామానికి చెందిన కొత్తపెల్లి సమ్మయ్య(55) మృతి చెందాడు. లారీ డ్రైవర్ యశ్వంత్ తీవ్రంగా గాయపడ్డాడు. ఇలా నిత్యం ఇసుక లారీలు అధికలోడుతో పాటు వేగంగా వెళ్తుండడంతో అనేక రోడ్డు ప్రమాదాలు జరిగి రోడ్లన్నీ నెత్తుటి రోడ్లులా మారుతున్నాయి. వారి కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపుతున్నాయి. రాత్రివేళలో ఇసుక క్వారీల నుంచి లారీలు పట్టణాలకు వెళ్తున్నాయని చెప్పడానికి ఇదే నిదర్శనంగా మారింది.



లారీల కారణంగా నిలిచిపోయిన వాహనాలు

రోడ్డు దెబ్బతినడం వల్లే..

అధిక లోడ్‌తో వెళ్తున్న ఇసుక లారీలతో జాతీయ రహదారి

మిగతా 8వ పేజీలో..

కొరవడిన నిఘా

అటవీ శాఖ చెక్ పోస్టు బార్లా తెరిచి ఉండడంతో ఇసుక లారీలు ఏ సమయంలోనైనా సజావుగా వెళ్తున్నాయి. వన్యప్రాణి నిబంధనల ప్రకారం రాత్రివేళలో భారీ వాహనాలు వెళ్లొద్దని నిబంధనలు ఉన్నాయి. గతంలో ఇసుక లారీల డ్రైవర్ల నుంచి అక్కడ విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది డబ్బులు వసూలు చేస్తూ అధికారులకు పట్టుబడ్డారు. దీంతో క్వారీల నుంచి వచ్చే ఇసుక లారీలను నిలపడం, తనిఖీ చేయడం వంటివి చేయకపోవడంతో పాటు ఉదయం, రాత్రి వేళల్లో చెక్ పోస్టు తెరిచి ఉండడంతో ఎప్పుడు పడితే అప్పుడు రవాణా సాగిస్తున్నారు. మేడారం నుంచి రాత్రి వేళలో తిరిగి ఇంటికి చేరుకునే భక్తులకు, వాహనాలకు ఇసుక క్వారీలు ఎదురు కావడంతో వారి గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. అజాగ్రత్తగా, అధికవేగంగా, అధిక లోడుతో లారీలు నడుస్తుండడంపై భక్తులు తీవ్రంగా మండిపడుతున్నారు.



రాత్రి వేళల్లో తరలిపోతున్న ఇసుక లారీలు



గట్టమ్మ దేవతను దర్శించుకుంటున్న హైకోర్టు న్యాయమూర్తి

గట్టమ్మను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి

ములుగు, జనవరి 28: జిల్లా కేంద్రం శివారులోని గట్టమ్మ ఆలయాన్ని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి ఎస్.రాజేశ్వర్‌రావు ఆదివారం సందర్శించారు. గట్టమ్మను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా కోర్టు జడ్జి లలితా శివజ్యోతి, సీనియర్ సివిల్ జడ్జి మాధవి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రామ్మోహన్‌రెడ్డి, జూనియర్ సివిల్ జడ్జి సౌఖ్య, ఎస్పీ శబరీశ్ ఆయనకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా బార్ సోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.


సీఎంవోఏఐ అధ్యక్షుడిగా వెంకట్రామిరెడ్డి



కాకతీయఖని, జనవరి 28: అఖిల భారత బొగ్గు గని అధికారుల సంఘం (సీఎంవోఏఐ) భూపాలపల్లి ఏరియా అధ్యక్షుడిగా వెంకట్రామిరెడ్డి ఎన్నికయ్యారు. భూపాపల్లి ఏరియాలోని ఇల్లందు క్లబ్‌హౌస్‌లో సీఎంవోఏఐ ఎన్నికలు ఆదివారం జరిగాయి. వెంకట్రామిరెడ్డి అధ్యక్షుడిగా, ఉపాధ్యక్షులుగా జాకీర్ హుస్సేన్, యాసీన్, జాయింట్ సెక్రటరీలుగా డాక్టర్ హరిప్రసాద్, మన్నాన్, కోశాధికారిగా గణేష్, సహాయక కోశాధికారిగా సాయికృష్ణను ఏకగ్రీవంఆ ఎన్నుకున్నారు.

కొనసాగుతున్న దేవాదుల పంపింగ్

కన్నాయిగూడెం, జనవరి 28 : మండలంలోని గుట్టల గంగారం వద్ద ఉన్న జె.చొక్కారావు దేవాదుల ఎత్తి పోతల ప్రాజెక్టు నుంచి పంపింగ్ కొనసాగుతోంది. ఇప్పటికే ఫేజ్-2లో ఒక మోటార్, ఫేజ్-3లో మూడు మోటార్ల ద్వారా నీటిని పంపింగ్ చేస్తున్న ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. ఆదివారం ఫేజ్-3లో మరో మోటారును ప్రారంభించారు. మొత్తం ఐదు మోటార్ల ద్వారా 1,415 క్యూసెక్కుల నీటిని ఎత్తి పోస్తున్నారు. ఎగువ నుంచి 7,450 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండటంతో తుపాకులగూడెం వద్ద ఉన్న సమ్మక్క సాగర్ బ్యారేజీలోని రెండు గేట్లు ఎత్తి 6,035 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. కాగా బ్యారేజీ వద్ద 80.00 మీటర్ల నీటిమట్టం నమోదైసంది. దేవాదుల ఇన్‌టేక్‌వెల్ వద్ద నీటిమట్టం 79.10 మీటర్లు ఉంది.



దేవాదుల ఇంటెక్వెల్ వద్ద చేరిన నీళ్లు

ప్రజలకు నాసిరకం బియ్యం సరఫరా

కేంద్ర మంత్రి పియూష్ గోయల్‌కు వినియోగదారుల మండలి ప్రతినిధుల ఫిర్యాదు

హనుమకొండ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలో పౌరసరఫరాల శాఖ బియ్యం సరఫరాలో పాల్పడుతున్న అవతవకలపై వినియోగదారుల మండలి ప్రతినిధులు న్యూఢిల్లీలోని కేంద్ర వినియోగదారుల వ్యవహారాల మంత్రి పియూష్ గోయల్‌కు ఆదివారం ఫిర్యాదు చేశారు. పౌర సరఫరాల శాఖ అధికారులు మండల లెవల్ స్టాక్ పాయింట్ల నుంచి వివిధ చౌకడిపోఆల ద్వారా వినియోగదారులకు నాసిరకం, దొడ్డు బియ్యం సరఫరా చేస్తూ బియ్యాన్ని సేకరిస్తున్న రైస్ మిల్లర్లకు మేలు రకం బియ్యం ధర చెల్లిస్తున్నారని ఆ ఫిర్యాదులు జాతీయ వినియోగదారుల మండలి ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి, సీసీఐ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలిచెర్ల సుదర్శన్ పేర్కొన్నారు.

ఉమ్మడి జిల్లాలో సివిల్ సప్లయీస్ గోదాములకు మిల్లర్లు ఇచ్చిన బియ్యం శాంపిళ్లను ప్రదర్శించడం లేదని, గోదాములు ఇన్‌చార్జిలు, ఫుడ్ ఇన్స్‌పెక్టర్లు, నాసిరకం బియ్యం బస్తాలకు ఫోర్టిఫైడ్ బియ్యం లేబుళ్లు వేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమైన తెలంగాణ ఆహార భద్రతా కమిషన్‌కు ఫిర్యాదుచేసినా పట్టించుకోవడం లేదని వారు తెలిపారు. వరంగల్ కార్పొరేషన్ పరిధిలోని పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆహార భద్రతా చట్టం-2013 నిబంధనలు తప్పనిసరిగా అమలు జరిగేలా చూడాలని వినియోగదారుల మండలి ప్రతినిధులు కేంద్ర మంత్రి పియూష్ గోయల్‌ను కోరారు. ఈ మేరకు కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించి విచారణకు ఆదేశించారని వారు తెలిపారు.



న్యూఢిల్లీలో కృషి భవనం ముందు వినియోగదారుల మండలి ప్రతినిధులు



సమావేశంలో మాట్లాడుతున్న జన్ను సాంబయ్య

పేదల సమస్యలపై రాజీలేని పోరాటం

రిపబ్లికన్ పార్టీ ఆఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు జన్ను సాంబయ్య

వడ్డెపల్లి, జనవరి 28: పేద ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటాలు చేయడమే తమ పార్టీ ఎజెండా అని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ తెలంగాణ (బొజ్జా తారకం) రాష్ట్ర అధ్యక్షుడు జన్ను సాంబయ్య అన్నారు. ఆదివారం హనుమకొండ రాంనగర్‌లోని కార్యాలయంలో నిర్వహించిన రాష్ట్ర కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు ప్రభుత్వమే నిర్మించి ఇవ్వాలని, స్వయం ఉపాధి కల్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠ్యపుస్తకాల్లో భారత రాజ్యాంగ పీఠిక ముద్రించాలని డిమాండ్ చేశారు. అనంతరం కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా జన్ను సాంబయ్య, రాష్ట్ర చైర్మన్‌గా రెడ్డిమల్ల శ్రీనివాస్, గౌరవ సలహాదారులుగా బండి మొగిలి, మైదం జైపాల్, ఉపాధ్యక్షులుగా కొప్పుల రామారావు, నక్క భిక్షపతి, నాగెల్లి కోమల, రెడ్డిమల్ల పార్వతి, ప్రధాన కార్యదర్శిగా వి.స్వర్ణలత ఎన్నికయ్యారు. రాష్ట్ర కార్యదర్శిగా జమ్మల నాగరాజు, రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా బొచ్చు సాంబయ్య, బొడ్డు సత్యనారాయణలను ఎన్నుకున్నారు.

పులిమడుగును సందర్శించిన డీఎఫ్‌వోలు



పులిమడుగును సందర్శిస్తున్న డీఎఫ్‌వోలు రవి కిరణ్, అర్పణ

గూడూరు (మహబూబాబాద్ జిల్లా), జనవరి 28 : గూడూరు అటవీశాఖ పరిధిలోని కార్లాయి సెక్షన్ పరిధిలోని పులి మడుగును మహబూబాబాద్ డీఎఫ్‌వో రవికిరణ్, వరంగల్ డీఎఫ్‌వో అర్పణ ఆదివారం సందర్శిం చారు. పులిమడుగులో ఇటీవల నిర్వహించిన క్యాంపెన్ క్వాటర్‌ను పరిశీలించి పులిమడుగులో బోటింగ్ చేశారు. అటవీ వనరులు ఆక్రమణకు గురికాకుండా ఉండేందుకు అటవీశాఖ ఇటీవల ఈ క్వార్టర్‌ను నిర్మించిన సంగతి తెలిసిందే. కాగా, ఒకేశాఖలో ఒకేక్యాడర్‌లో పని చేస్తున్న ఈ ఇరువురు డీఎఫ్‌వోలు దంపతులు కావడం విశేషం.

10 కిలోల గంజాయి స్వాధీనం

వరంగల్‌సిటీ, జనవరి 28: ఎక్సైజ్ ప్రొహిబిషన్ డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు గంజాయి నిర్మూలనకు చేపడుతున్న కార్యక్రమంలో భాగంగా ఆదివారం వరంగల్ రైల్వే స్టేషన్‌లో తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీల్లో కోణార్క్, సింగరేణి ప్యాసింజర్, సీటీటీ రైళ్లలో తనిఖీలు చేపట్టారు. రైలు ద్వారా ఎండు గంజాయిని రవాణా చేస్తున్న ఒడిషా రాష్ట్రానికి చెందిన సంజయ్ నాయక్‌ను పట్టుకుని అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి 10 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఖిలావరంగల్ ఎక్సైజ్ సీఐ బి.చంద్రమోహన్ తెలిపారు. ఈతనిఖీల్లో సీఐ నీరజ, ఖిలావరంగల్ ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

తపాలా సేవలు పొడిగింపు

- వరంగల్ హెడ్‌పోస్టాఫీసులో ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు..
- ఇంటి వద్దనే శిశు ఆధార్ ఉచితం
- విదేశాలకు అందుబాటు ధరలతో పార్సెల్స్

గిర్మాజిపేట(వరంగల్), జనవరి 28: ఉత్తరాలు, పార్సెల్స్, బ్యాంకింగ్, జీవిత బీమా పథకాల సేవలను ప్రజలకు అందచేస్తున్న వరంగల్ హెడ్‌పోస్టాఫీసు పని వేళలను ప్రజలకు మరింతగా అందుబాటులోకి తీసుకువచ్చింది. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని పోస్టాఫీసులు రోజుకు 8 గంటలు పనిచేస్తుండగా వరంగల్‌లోని హెడ్‌పోస్టాఫీసు 12 గంటలు పనిచేస్తూ ప్రజలకు మరింత విస్తృతంగా తపాలా సేవలను అందచేస్తోంది. అంతేకాదు 5 ఏళ్ల లోపు పిల్లలకు ఇంటి వద్దనే ఉచితంగా పోస్టుమన్ ద్వారా శిశు ఆధార్ నమోదు సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. వరంగల్ రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న హెడ్‌పోస్టాఫీసు సేవలు ఇలా వున్నాయి.

తపాలా సేవలివే..

వరంగల్ హెడ్‌పోస్టాఫీసులో పలురకాల తపాలా సేవలు లభిస్తున్నాయి. రెవెన్యూ, పోస్టల్ స్టాంపుల విక్రయం, దేశ, విదేశాలకు ఉత్తరాలు, పార్సెల్స్ పంపిణీ, ఇండియన్ పోస్టల్ బ్యాంకింగ్, తపాలా సేవింగ్ పథకాలు, చిన్నమొత్తాల పొదుపు పథకాలు, తపాలా బీమా పథకాలు ప్రజలు పొందుతున్నారు.

ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు..

హెడ్‌పోస్టాఫీసు పనివేళలు గతంలో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఉండేవి. ఈ సమయంలోనే ప్రజలు తపాలా సేవలు పొందేవారు. అయితే సాయంత్రం 5.30 గంటలు దాటితే హెడ్‌పోస్టాఫీసు మూసివేసేవారు. దీంతో తపాలా సేవలు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. దీన్ని గుర్తించిన తపాలా శాఖ రాష్ట్రంలో సికింద్రాబాద్, వరంగల్ హెడ్‌పోస్టాఫీసు పని వేళలలను ప్రస్తుతం 8 గంటల పని విధానాన్ని 12 గంటలకు పొడిగించింది. ఈ మేరకు వరంగల్ డివిజనల్ పోస్టల్ సూపరింటెండెంట్ స్వామి వెంకటలక్ష్మినరసింహరావు వరంగల్ హెడ్‌పోస్టాఫీసు పనివేళలను ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులోకి తీసుకువచ్చారు. దీంతో ప్రతి రోజు ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు హెడ్‌పోస్టాఫీసు పనిచేస్తున్నది.

ఇంటి వద్దనే శిశు ఆధార్ నమోదు

తపాలాశాఖ ఇంటి వద్దనే పోస్టుమన్ ద్వారా ఉచితంగా శిశువుల ఆధార్ నమోదు చేస్తోంది. ఇందుకుగాను వరంగల్ హెడ్‌పోస్టాఫీసు పరిధిలోని పోస్టుమన్‌లకు ఆధార్ నమోదుపై శిక్షణ ఇచ్చారు. 0 నుంచి 5 సంవత్సరాల శిశువుల ఆధార్ నమోదు కోసం తల్లిదండ్రులు ఆధార్ సెంటర్‌కు వెళ్లాల్సిన అవసరం లేదు. తమ ప్రాంతానికి వచ్చే పోస్టుమన్‌ను తల్లిదండ్రులు కలిసి శిశువులకు కొత్తగా ఆధార్ నమోదు చేసుకోవచ్చు. పోస్టుమన్‌లు తమ వద్ద ఉన్న సెల్‌ఫోన్ ద్వారా తల్లిదండ్రుల సమాచారం, ఆధార్‌కార్డుల సమాచారంతో 0 నుంచి 5 సంవత్సరాల శిశువుల ఆధార్ నమోదు ఉచితంగా చేస్తారు. ఇందుకు గాను ఎలాంటి డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదు.



వరంగల్ హెడ్‌పోస్టాఫీసు

పోస్టాఫీసులో ఆధార్ సేవా కేంద్రం

వరంగల్ హెడ్‌పోస్టాఫీసులో ప్రత్యేకంగా ఆధార్ సేవా కేంద్రం పనిచేస్తోంది. ఇందులో కొత్తగా ఆధార్ నమోదు మాత్రం ఉచితంగా చేస్తారు. అయితే ప్రస్తుత ఆధార్ కార్డులో పేర్లు, ఇంటిపేర్లు, చిరునామా, పుట్టిన తేదీ, ఫొటో, వేలిముద్రలు తదితర సవరింపులను మాత్రమే ఆధార్ సంస్థ నిర్ణయించిన ఫీజుతో చేస్తారు. ప్రస్తుత ఆధార్‌లో ఇంటి పేరు, పేరు, పుట్టిన తేదీ, చిరునామా తదితర మార్పుల కోసం తప్పనిసరిగా సంబంధిత సర్టిఫికెట్ వెంట తెచ్చుకోవాల్సి ఉంటుంది. పుట్టిన తేదీ సవరణకు విద్యాసంస్థ, మునిసిపల్ బర్త్ సర్టిఫికెట్, పాస్‌పోర్టుతో చేసుకోవచ్చు. ఈ ఆధార్ సెంటర్ కూడా ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు పనిచేయనుంది. ఆధార్ డౌన్‌లోడ్, ప్రింట్‌కు రూ.30 చెల్లించాలి.

అందుబాటు చార్జీలతో పార్సెల్స్

విదేశాలలో ఉంటున్న తమ కుటుంబ సభ్యులకు అవసరమైన వస్తువులు, మందులు, పిండివంటలు తదితర పార్సెల్స్‌ను వరంగల్ హెడ్‌పోస్టాఫీసు సెంటర్‌లోని ప్రత్యేక పార్సెల్ కేంద్రం ద్వారా పంపవచ్చు. ప్రయివేట్ కొరియర్ సర్వీసుల కంటే తక్కువ చార్జీలు ఉన్నాయని తపాలా అధికారులు చెబుతున్నారు. నామమాత్రపు చార్జీతో అధునాతన ప్యాకింగ్



పార్సెల్స్ యంత్రం

యంత్రంతో పార్సెల్స్‌ను ప్యాకింగ్ చేస్తున్నారు. ప్యాకింగ్ సైజ్ మేరకు చార్జి ఉంటుంది. ప్రతి అర కిలో(500 గ్రాములు)కు అమెరికాకు రూ.1,550, కెనడాకు రూ.1,180, ఆస్ట్రేలియాకు రూ.975, యూకేకు రూ.1,570 చార్జి ఉంటుంది. ప్రపంచంలోని దాదాపు అన్ని దేశాలకు తపాలా శాఖ విదేశీ పార్సెల్స్ సదుపాయం ఉందని అధికారులు చెబుతున్నారు.

తపాలా బీమా పథకాలు

సామాన్య, మధ్య తరగతి వర్గాలకు అందుబాటులో వివిధ జీవిత, ప్రమాద బీమా పథకాలను తపాలా శాఖ అమలు చేస్తోంది. టాటా, ఏఐజీ సహకారంతో రూ.10 లక్షలు, రూ.5 లక్షల యాక్సిడెంటల్ బీమా పాలసీని అమలు చేస్తోంది. 18 నుంచి 65 సంవత్సరాల లోపు కలిగిన వారు సంవత్సరానికి రూ.520 చెల్లిస్తే రూ.10 లక్షల యాక్సిడెంటల్ బీమా, రూ.320 చెల్లిస్తే రూ.5 లక్షల యాక్సిడెంటల్ బీమా వర్తిస్తుందని తపాలా అధికారులు తెలిపారు. అలాగే నీవా బుపా హెల్త్ ఇన్సురెన్స్ సంస్థతో కలిసి తపాలా శాఖ సంవత్సరానికి రూ.755 ప్రీమియంతో రూ.15లక్షల హెల్త్ ఇన్సురెన్స్ పాలసీని అమలు చేస్తోంది. ఇవే కాకుండా సేవింగ్ అకౌంట్‌లు, డిపాజిట్ పథకాలతో పిల్లలకు సుకన్య సమృద్ధి యోజన, సీనియర్ సిటిజన్‌లు, మహిళల కోసం ప్రత్యేక డిపాజిట్, సేవింగ్, నెలవారి ఆదాయం స్కీంలను తపాలా శాఖ అమలు చేస్తున్నది.

తపాలా సేవలు వినియోగించుకోండి

ఎస్‌వీఎల్ఎన్ రావు, పోస్టల్ సూపరింటెండెంట్



ప్రజలకు మరింత మెరుగైన తపాలా సేవలను అందించేందుకు గాను వరంగల్ హెడ్‌పోస్టాఫీసు పని వేళలను 12 గంటలకు పెంచాం. ప్రతి రోజు ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రజలు హెడ్‌పోస్టాఫీసులో తపాలా సేవలు పొందవచ్చు. తమ ప్రాంత పోస్టుమన్‌ల ద్వారా ఉచితంగా ఇంటి వద్దనే శిశు ఆధార్ నమోదును తల్లిదండ్రులు వినియోగించుకోవాలి. అలాగే తపాలా బ్యాంకింగ్, జీవిత, ప్రమాద బీమా పథకాలు, అందుబాటు చార్జీలతో విదేశాలకు పార్సెల్స్ సదుపాయం కూడా ఉంది.



కేకును కట్ చేస్తున్న నిట్ డైరెక్టర్ విద్యాధర సుబుద్ధి

ఏకశిల జూనియర్ కళాశాలల సెలబ్రేషన్స్

ముఖ్య అతిథులుగా నిట్ డైరెక్టర్ విద్యాధర సుబుద్ధి, ఇన్‌కం ట్యాక్స్ కమిషనర్ జీవన్‌లాల్ లావుడియా

హనుమకొండ రూరల్, జనవరి 28: ఏకశిల జూనియర్ కళాశాలల స్పార్కిల్ సెలబ్రేషన్స్ హసన్‌పర్తి పెంబర్తిలోని ఏకశిల టెక్నో స్కూల్‌లో ఆదివారం ఘనంగా జరిగాయి. ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ గౌరు తిరుపతిరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ విద్యాధర సుబుద్ధి, ఇన్‌కం ట్యాక్స్ కమిషనర్ జీవన్‌లాల్ లావుడియా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాలం విలువ గుర్తించిన వారే విజయ సోపానాలు పొందుతారని అన్నారు. ఎవరి సమయం వారికి మంచి అవకాశాలు ఇస్తుందని, దానిని సద్వినియోగం చేసుకున్నవారే విజేతలుగా నిలుస్తారని తెలిపారు. విద్యాసంస్థల చైర్మన్ గౌరు తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. ఐఐటీ, నీట్ పోటీ పరీక్షలలో ఎంపికైన ఏకశిల విద్యార్థులకు రూ.10వేల నగదు పారితోషికం ప్రకటించారు. ఇంటర్ మొదటి సంవత్సరం టాపర్స్‌కి రెండో సంవత్సరంలో ఫీజులో రాయితీ ఇవ్వనున్నట్లు ప్రకటించారు. కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన ఆటపాటలు అలరించారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్ గౌరు రాజిరెడ్డి, బేతి కొండల్‌రెడ్డి, గౌరు సువిజ తిరుపతిరెడ్డి, ముచ్చ జితేందర్‌రెడ్డి, కళాశాలల ప్రిన్సిపాల్స్ ఇ.తిరుపతిరెడ్డి, జి.సుధాకర్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తెలంగాణలో పది సీట్లు గెలుస్తాం..

- బీఆర్ఎస్ మూడోస్థానానికే పరిమితం
- కేటీఆర్ నోరు అదుపులో పెట్టుకోవాలి
- కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్



అధికారులతో కలిసి పనులను పరిశీలిస్తున్న ఎంపీ సంజయ్

కమలాపూర్, జనవరి 28: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ పార్టీ తెలంగాణలో పదిసీట్లు గెలుస్తామని కరీంనగర్ ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ అన్నారు. కమలాపూర్ మండలంలోని ఉప్పల్ గ్రామంలోని రైల్వే గేటు వద్ద నిర్మిస్తున్న ఆర్‌వోబీ పనులను ఆదివారం సాయంత్రం రైల్వే అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. నిర్ణీత గడువులోగా బ్రిడ్జి నిర్మాణ పనులను పూర్తి చేయాలని అధికారులను కోరారు. కొవిడ్-19, ఆర్వోబీ డిజైన్ మార్పు వల్ల నిర్మాణ పనుల్లో జాప్యం జరిగిందన్నారు. బ్రిడ్జి నిర్మాణంపై ఇదివరకు అధికారులతో రెండు, మూడు సార్లు సమీక్ష సమావేశం నిర్వహించామన్నారు. కేంద్ర ప్రభుత్వ పనులు ఆగవని, గత ప్రభుత్వం సహకరించకపోవడంతోనే నిర్మాణం అలస్యమైందన్నారు. పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఉప్పల్ రైల్వే స్టేషన్‌లో టిక్కెట్ రిజర్వేషన్ కౌంటర్‌ను ఏర్పాటు చేస్తామని, రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్ర మాజీ మంత్రి కేటీఆర్ నోరు అదుపులో పెట్టుకోవాలని అన్నారు. తన తండ్రి పేరు చెప్పుకొని కేటీఆర్ రాజకీయాల్లోకి వచ్చాడని, తాను పోరాటం చేసి పైకి వచ్చానని అన్నారు. తాను హిందు ధర్మం కోసం మాట్లాడితే తనను మతం పెట్టుకొమ్మని కేటీఆర్ అంటున్నాడని ఆయన ఆరోపించారు. పదే, పదే ముస్లింల గురించి మాట్లాడుతున్న కేటీఆర్ మసీదు కట్టుకొని నమాజ్ చేయాలని, ప్రజలకు అందుబాటులో లేకుండా ఫాంహౌస్‌లో ఉన్న కేసీఆర్‌కు సీఎం పదవి అవసరం లేదని బార్ కట్టుకోవాలని ఆయన విమర్శించారు. మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఏమి అభివృద్ధి పనులు చేయలేదని విమర్శించారు. కేటీఆర్, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్‌లు ఇద్దరు నాస్తికులు అని, నియోజకవర్గంలో మెజారిటీ ప్రజలు దేవుళ్లను పూజిస్తారని, దేవుడిని పూజించే ప్రజలు దేవుడిని నమ్మనివారికి ఓట్లు వేస్తారా? అని ఆయన ప్రశ్నించారు. ప్రధానిగా నరేంద్ర మోదీ ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారని, వచ్చే పార్లమెంట్ ఎన్నికలలో బీజేపీ పది స్థానాలను గెలుస్తుందని, బీఆర్ఎస్ పార్టీ మూడో స్థానానికే పరిమితమవుతుందని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు గంగ్ర నళిని, కరీంనగర్ బీజేపీ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి, బొమ్మ శ్రీరాం చక్రవర్తి, పుప్పాల రఘు, గౌతంరెడ్డి, మాట్ల రమేష్, కట్కూరి అశోక్‌రెడ్డి, తుమ్మ శోభన్‌బాబు, సర్పంచ్ శ్రీనివాస్, ఎంపీటీసీ శ్రీనివాస్, బండారి సుధాకర్, తోట సురేష్, చిట్టి సుందరయ్య, ర్యాకం శ్రీనివాస్, అంజయ్య, భూపతి ప్రవీన్, కార్యకర్తలు తదితతరులు పాల్గొన్నారు.

వైభవంగా గొంతెమ్మగుట్ట మహాజాతర



గొంతెమ్మకు బోనాలు సమర్పిస్తున్న భక్తులు

కాటారం, జనవరి 28: మండలంలోని ప్రతాపగిరి శివారు అటవీప్రాంతంలోని గొంతెమ్మ గుట్టపై మూడు రోజుల పాటు నిర్వహించిన లక్ష్మీదేవర మహాజాతర ఆదివారంతో ముగిసింది. చివరి రోజు అంగరంగ వైభవంగా జరిగింది. పలు ప్రాంతాల నుంచి వచ్చిన నాయకపోడ్ కులస్థులు, జాతర నిర్వాహకులు 15కి పైగా లక్ష్మీదేవరలతో డప్పు చప్పుళ్ల, శివసత్తుల పూనకాల మధ్య గొంతెమ్మ, లక్ష్మీదేవర పెద్ద పట్నాలు వేసి బోనాలు సమర్పించారు. అనంతరం లక్ష్మీదేవరల విన్యాసాలతో పట్నాలు తొక్కించే కార్యక్రమం చేపట్టారు. భూపాలపల్లి ఎస్పీ కిరణ్‌ఖరే దంపతులు, పలువురు పోలీసు అధికారులు, ఎంపీపీ పంతకాని సమ్మయ్య, ఎంపీటీసీలు రవీందర్‌రావు, మహేశ్వరి, విజయారెడ్డి, బోడ మమత, సర్పంచులు లక్ష్మి, దేవేందర్, రఘురాం, అశోక్, నరేష్, శేఖర్, రమేష్, కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, బీఎస్పీ నేతలు జాతరలో పాల్గొని దేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు. ఉమ్మడి కరీంగనర్, ఉమ్మడి వరంగల్ జిల్లాల్లోని పలు ప్రాంతాలతోపాటు మహారాష్ట్రకు చెందిన భక్తులు అటవీమార్గం మీదుగా ప్రైవేటు వాహనాల్లో జాతరకు తరలివచ్చారు. గుట్టపై సొరంగంలోని గొంతెమ్మ, కృష్ణుడి పాదాలు, శివలింగానికి భక్తులు మొక్కుకున్నారు. ఇరుకైన దారి గుండా భక్తులు త్వరగా వెళ్లడానికి దూసుకురాగా పోలీసులు, నిర్వాహకులు ఒక్కోసారి కొద్దిమందిని వదులుతూ దర్శనం కల్పించారు. సీఐ రంజిత్‌రావు నేతృత్వంలో ఎస్సైలు అభినవ్, సుధాకర్, నరేష్, లక్ష్మణ్‌రావు సీఆర్‌పీఎఫ్, సివిల్ పోలీస్ బలగాలతో బందోబస్తు చేపట్టారు. పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ మౌనిక, గీత, సుప్రియ వైద్యసిబ్బందితో కలిసి వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. గుట్టకు వెళ్లే దారి అటవీ ప్రాంతంలో ఇరుకుగా, కచ్చా రోడ్డు ఉండటంతో వచ్చిపోయే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దారి గుండా ఒకే వాహనం వెళ్లే వీలుండటంతో వాహనదారులు ఇక్కట్లు ఎదుర్కున్నారు. పలువురు దాతల సహకారంతో జాతర కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం నిర్వహించారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రస్తుత జాతరకు ప్రభుత్వం రూ.20 లక్షల నిధులు మంజూరు చేయించిన తాత్కాలిక ఏర్పాట్లే జరిగాయని, రాబోయే జాతరకు ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించి శాశ్వతంగా అభివృద్ధి చేయడంతో పాటు భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు. పలు పార్టీల నాయకులు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, గద్దె సమ్మిరెడ్డి, అంగోత్ సుగుణ, సుజాత, వంశవర్ధన్‌రావు, తిరుపతిరావు, సురేందర్‌రెడ్డి, మధుకర్, కుమార్, కొమురయ్య, రామిళ్ల కిరణ్, రత్న సౌజన్య, జోడు శ్రీనివాస్, దబ్బెట రాజేషం, శేఖర్, రాజేంద్రాచారి తదితరులు జాతరలో పాల్గొని మొక్కులు సమర్పించుకున్నారు. పోతురాజుల విన్యాసాలు, నాయకపోడు కళాబృందాల సాంస్కృతిక కార్యక్ర మాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జాతర నిర్వాహకులు మేకల సంతోష్, గుంటి రాజేందర్, పోచం, పెద్ద కిష్టయ్య, చిన్నకిష్టయ్య, పోలం సంతోష్, సురేందర్, గుంటి రమేష్, గుంటి అశోక్, మధునయ్య మల్లేష్, ప్రతాప్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



మల్లన్నకు హారతి ఇస్తున్న వీరశైవార్చకులు

కొమురవెల్లి మల్లన్నకు లష్కర్ బోనాలు

భక్తులతో పోటెత్తిన మల్లన్న ఆలయం

చేర్యాల, జనవరి 28: కొమరవెల్లి మల్లికార్జునస్వామి దేవాలయం లష్కర్ భక్తులతో పోటెత్తింది. మల్లన్న బ్రహ్మోత్సవాలలో భాగంగా సంక్రాంతి తరువాత వచ్చిన రెండవవారమైన ఆదివారం రోజున సికిందరాబా దుకు చెందిన వేలాదిమంది భక్తులు స్వామివారి దర్శనార్థం తరలివ చ్చారు. ఇలవేల్పు దైవాన్ని దర్శించు కుని పులకించిపోయారు. ఆలయ ప్రాంగణంలో విక్రయించే కూరగాయలను కొనుగోలు చేసి నూతన మట్టి కుండల్లో బోనం చేసి మల్లన్నకు నివేదించి పట్నాలు వేశారు. తమ కోరికలు నెరవేర్చమని ఆలయప్రాంగ ణంలోని గంగరేగుచెట్టుకు ముడుపులు కట్టారు. ఓడుబియ్యాలు పోసి తమను సల్లంగా కాపాడమని వేడు కున్నారు. తమకు సంతానం కలగాలని వేడుకుంటూ ఒళ్లుబండ వద్ద వరంపట్టారు.

ఎల్లమ్మతల్లికి ఘనంగా బోనాలు

మల్లన్న సహోదరి ఎల్లమ్మదేవతకు బోనంచేసి డప్పుచప్పుళ్ల హోరుతో, పూనకంతో శివమెత్తారు. దేవతలనా మస్మరణతో గుట్టపైకి ఎక్కి బోనాన్ని సమర్పించారు. భక్తులరద్దీ అధికంగా ఉండడంతో ప్రత్యేక, దర్శదర్శన క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. దీంతో గంటల తరబడిగా పడిగాపులు కాయడంతో తీవ్ర ఇబ్బందులుపడ్డారు. పట్నాలు వేసిన భక్తులతో గంగిరేగుచెట్టు ప్రాంగణం కిటకిటలాడింది. మొక్కుబడిగా భక్తులు కట్టిన ము డుపులతో గంగరేగుచెట్టు నిండిపోయింది. ఈవో బాలాజీశర్మ ఏర్పాట్లు పర్యవేక్షించారు. హుస్నాబాద్ ఏసీపీ వాసాల సతీశ్, చేర్యాల సీఐ సత్యనారాయణరెడ్డి పర్యవేక్షణలో కొమురవెల్లి ఎస్ఐ నాగరాజు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.



బోనాలు తీసుకువస్తున్న లష్కర్ భక్తులు

గ్యాస్ సిలిండర్‌లో నీరు



గ్యాస్ సిలిండర్‌ను పరిశీలిస్తున్న వినియోగదారుడు

వర్ధన్నపేట, జనవరి 28 : వంట గ్యాస్ వినియోగదారునికి వింత అనుభవం ఎదురైంది. సిలిండర్‌లో వంట గ్యాస్ ఇంధనానికి బదులు నీరు ఉండటంతో అవాక్కు అయ్యారు. వర్ధన్నపేట పట్టణానికి చెందిన ఆకుల సత్యం అనే వినియోగదారుడు ఎప్పటిలాగే గ్యాస్ బుక్ చేశాడు. సంగెం మండలంలోని ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ నుంచి సిలిండర్ రాగానే స్టౌవ్‌కు పెట్టి వెలిగించాడు. ఎంత చూసిన మంట రాకపోవడంతో అనుమానం వచ్చి సిలిండర్‌ను పరిశీలించాడు. దీంతో గ్యాస్ సిలిండర్‌లో గ్యాస్ కాకుండా నీరు ఉండటాన్ని గమనించి నిర్ఘాంతపోయాడు. వెంటనే గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులపై మండిపడుతూ వారిపై చర్యలు తీసుకొని వినియోగదారులకు నాణ్యమైన సిలిండర్ అందించాలని డిమాండ్ చేశారు

వీధి కుక్కలకు చర్మవ్యాధులు

గ్రామాల్లో విచ్చలవిడిగా తిరుగున్న వైనం ● మహబూబాబాద్ జిల్లాప్రజలకు పొంచి ఉన్న ముప్పు



మరిపెడ (మహబూబాబాద్ జిల్లా), జనవరి 28 : మహబూబాబాద్ జిల్లా మరిపెడ మునిసిపల్‌తో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో వీధికుక్కలు చర్మ వ్యాధుల బారిన పడి భయానక వాతావరణం సృష్టిస్తున్నాయి. ఏ గల్లీకి వెళ్లినా వ్యాధి బారిన పడిన కుక్కలే దర్శనమిస్తున్నాయి. కుక్కలకు సోకిన వ్యాధితో మానవాళి మనుగడకు సైతం భారీ ప్రమాదం వాటిల్లే అవకాశాలున్నాయి. విచ్చలవిడిగా వ్యాధుల బారిన కుక్కలచే రోగాలు వ్యాప్తి చెందే ప్రమాదం పొంచి ఉందని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. యుద్ధ ప్రతిపాదికన నివారణ చర్యలు తీసుకోవాల్సిన అధికార యం త్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. గ్రామ పంచాయతీల్లో అరకొరగా నిధులు ఉండటంతో సర్పంచ్‌లు సైతం చేతులెత్తేస్తున్నారు. కరోనా మహమ్మారి బారినుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న ప్రజలకు కుక్కల ద్వారా మరో ప్రమాదం ముంచుకొస్తుందనే ఆందోళనతో కొట్టుమిట్టాడుతున్నారు.

మరిపెడ, చిన్నగూడూరు, నర్సింహులపేట, దంతాలపల్లి, కురవి తదిరత మండలాల పరిధిలోని ఏ గ్రామంలోకి వెళ్లిన చర్మ వ్యాధుల బారిన పడిన వీధి కుక్కలు దర్శనమిస్తున్నాయని జనం వాపోతున్నారు. కుక్కలకు చర్మ వ్యాధుల నివారణ చర్యలు తీసుకోవాల్సిన జిల్లాలోని మున్సిపాలిటీలు,



గ్రామ పంచాయతీలు నిధుల కొరతతో వీధికుక్కల నిర్మూలనను గాలికొదిలేస్తున్నారు. కుక్కల చర్మ వ్యాధుల ద్వారా ప్రజలకు ప్రమాదం జరుగక ముందే రక్షణ చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

జిల్లాలో పలువురు బాధితులు

మహబూబాబాద్ జిల్లాలోని నాలుగు మునిసిపాలిటీలు, 461 గ్రామపంచాయతీలు ఉండగా, రెండు నెలలుగా కుక్క కాటుకు గురైన వారు అనేక మంది ఉన్నారు. చిన్నగూడూరు మండలం ఉగ్గంపల్లిలోనే 12 మందిని ఒకేరోజు ఊర కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. జిల్లా వ్యాప్తంగా గత సంవత్సరం మార్చి మాసం నుంచి డిసెంబరు వరకు 21 పీహెచ్‌సీల పరిధిలో సుమారు 4,000మందికి పైగా కుక్క కాటుతో గాయపడ్డారు. మరిపెడ మండలానికి చెందిన ఓ వ్యక్తి కుక్క కాటుకు గురియై ఇటీవలనే హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు.

జాగ్రత్త వహించడమే ఏకైక మార్గం

రమేశ్, వెటర్నరీ డాక్టర్, ఎడ్జర్ల



చర్మ వ్యాధుల బారిన పడ్డ కుక్కల పట్ల ప్రజలు జాగ్రత్తలు వహించడం ఒక్కటే మార్గం. వీధి కుక్కలకు సోకిన చర్మ వ్యాధుల నివారణకు ప్రభుత్వం నుంచి మందుల సరఫరా లేదు. కుక్కల సొల్లుద్వారా రేబీస్ వ్యాధి వ్యాప్తి చెందే ప్రమాదం ఉంది. గ్రామ పంచాయతీ సిబ్బందికి, ప్రజలకు అవగాహన కల్పించి తగు జాగ్రత్తలు పాటించాలి. వీటితో పాటు కుక్కలకు సోకిన చర్మవ్యాధి నివారణకు ఐవర్‌మెక్టిన్ అనే లిక్విడ్, మాత్రలను ఏదైన మాంసంలో కలిపి కుక్కలకు వారం రోజుల పాటు క్రమం తప్పకుండా అందజేసినట్లైయితే వ్యాధి ప్రభలకుండా కొంత వరకు అదుపు చేయవచ్చు.

ట్రాఫిక్‌ను నియంత్రించిన ఎస్పీ



వాహనాల రద్దీని పరిశీలిస్తున్న ఎస్పీ శబరీశ్

మేడారం, జనవరి 28: వనదేవతలకు ముందస్తు మొక్కులు చెల్లించుకోవడానికి ఆదివారం సుమారు 4 లక్షల మంది భక్తులు వేల సంఖ్యలో వాహనాల్లో మేడారం తరలివచ్చారు. గంటల వ్యవధిలోనే వాహనాల రద్దీ పెరగడంతో కొత్తూరు నుంచి జంపన్నావాగు వరకు ఆర్టీసీ బస్టాండ్ నుంచి గుడ్డెలుగు గుట్ట వరకు వాహనాలు క్యూ కట్టాయి. వెంటనే అప్రమత్తమైన ఎస్పీ శబరీశ్ సెట్‌లో వాహనాలను వెంటనే పార్కింగ్‌లకు తరలించాలని పోలీసులకు ఆదేశాలు జారిచేశారు. రోడ్లపై వాహనాలు నిలుపకుండా చర్యలు చేపట్టారు. పక్క ప్రణాళికలతో వాహనాలను గద్దెల పరిసరాలకు చేరుకునేలా ట్రాఫిక్ క్లియర్ చేశారు. స్వయంగా ఎస్పీ నార్లాపూర్ నుంచి కొత్తూరు మీదుగా మేడారం ఆర్టీసీ బస్టాండ్ వరకు కాలి నడకతో ట్రాఫిక్ నియంత్రణ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ శబరీష్ మీడియాతో మాట్లాడుతూ వనదేవతల దర్శనానికి వచ్చే భక్తులు రోడ్ల ఇరువైపులా తమ వాహనాలను నిలుపరాదని తేటి ప్రయాణికులకు ఇబ్బందులు కలుగకుండ పోలీస్ నిబంధనలను పాటించాలని కోరారు. ట్రాఫిక్ రూల్స్ పాటించాలని అన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

మేడారంలో వనదేవతలను దర్శించుకోవడానికి తరలి వచ్చిన భక్తులు వదులుతున్న వ్యర్థాలను పారిధ్య కార్మికులు వెంటవెంటనే తొలగిస్తున్నారు. ట్రాక్టర్ల ద్వారా డంపింగ్ యార్డులకు తరలించారు. శుద్ధ మేడారం దిశగా పనులు చేస్తున్నామని డీపీవో వెంకయ్య తెలిపారు. 200మంది కార్మికులతో ఆదివారం పారిశుధ్య పనులు చేపట్టినట్లు ఆయన తెలిపారు.

గ్రామాలే దేశానికి పట్టుగొమ్మలు



పెసా కోఆర్డినేటర్లు, మొబిలైజర్లకు గౌరవ వేతనం చెక్కును అందజేస్తున్న సీతక్క

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క

ములుగు కలెక్టరేట్, జనవరి 28: గ్రామాలే దేశానికి పట్టుగొమ్మలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. గ్రామాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ములుగు మండలంలోని గుర్తూరుతండాలో రూ.20 లక్షలతో, కాసిందేవిపేట గ్రామంలో రూ.16.83 లక్షల నిర్మించిన గ్రామపంచాయతీ భవనాలను ఆమె ఆదివారం అదనపు కలెక్టర్ పి.శ్రీజతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా సీతక్క మాట్లాడుతూ దేశ, రాష్ట్ర అభివృద్ధిలో గ్రామాలే పట్టుకొమ్మలని, మారుమూల గ్రామాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందినట్లు అని అన్నారు. ఇప్పటివరకు అభివృద్ధికి నోచుకోని గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తానని, ఏమైనా సమస్యలు ఉంటే ప్రజలు నా దృష్టికి తీసుకురావాలని కోరారు. అదేవిధంగా సాగుభూములకు పట్టాలు అందించడంతోపాటు సాగునీరు అందేవిధంగా కృషి చేస్తానని, సీసీరోడ్లను త్వరలో నిర్మిస్తామన్నారు. కాంగ్రెస్‌పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను పక్కాగా అమలు చేస్తామని పేర్కొన్నారు. ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.10లక్షల ఆరోగ్యశ్రీ పథకం అమలు చేశామని, త్వరలో నిరుపేదలను గుర్తించి రూ.5లక్షలతో ఇళ్లు నిర్మిస్తామని వివరించారు. ఈకార్యక్రమంలో జడ్పీ సీఈవో ప్రసూనరాణి, డీపీవో వెంకయ్య, ఐటీడీఏ ఈఈ హేమలత, సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, తదితరులు పాల్గొన్నారు.

పెసా కోఆర్డినేటర్లు, మొబిలైజర్లకు గౌరవ వేతనం

ఐదో షెడ్యూల్ ప్రాంతంలో పెసా చట్టం పరిధిలోని ఏజెన్సీ గ్రామాల అభివృద్ధి కోసం తొమ్మిది ఏజెన్సీ జిల్లాల పరిధిలో పనిచేస్తున్న పెసా కోఆర్డినేటర్లు, 1278మంది మొబిలైజర్లకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి సీతక్క ఆదివారం ములుగులో రూ.2,29,76వేలను చెక్కురూపంలో గౌరవ వేతనం అందజేశారు. ఈసందర్భంగా సీతక్క మాట్లాడుతూ ఏజెన్సీలోని ఆదివాసీ గిరిజన గ్రామాల అభివృద్ధి కోసం తమవంతు కృషి చేయాలని పెసా కమిటీలకు సూచించారు. భవిష్యత్తులో పెసా కమిటీల ఉద్యోగ భద్రత, చట్టం బలోపేతం కోసం కృషిచేస్తానని పేర్కొన్నారు. అదేవిధంగా 2019నుంచి 2023మార్చి వరకు రావాల్సిన పెండింగ్ వేతనాలను ఇప్పించాలని కోఆర్డినేటర్లు, మొబిలైజర్లు మంత్రిని కోరగా ఆమె సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో పెసా జిల్లా కోఆర్డినేటర్ కొమురం ప్రభాకర్, జిల్లా అధ్యక్షుడు ముత్యాలరావు, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు ఆగబోయిన రవి, మండల అధ్యక్షులు కార్తీక్, ఇర్ప వెంకట్, కొమురం చంద్రయ్య, ఇండ్ల సమ్మయ్య, వజ్జ రాజు, కోట మల్లేష్, ఇర్ప రాజుతోపాటు మొబిలైజర్లు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేసిన ఆర్టీసీ కార్మికులు

విలీన ప్రక్రియను పూర్తిచేసి అపాయింట్‌మెంట్ తేదీని ప్రకటించాలని కోరుతూ ఆర్టీసీ కార్మికులు ఆదివారం ములుగులో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్కను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా కండక్టర్ ఐక్యవేదిక సభ్యులు మాట్లాడుతూ ఆర్టీసీలో పదేళ్లుగా వేతన సవరణ జరగలేదని, తక్షణమే వేతన సవరణ ప్రక్రియ పూర్తిచేయాలని కోరారు. తెలంగాణ మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం నిమిత్తం ప్రత్యేకంగా మహాలక్ష్మి కార్డులు ఇవ్వాలని, మహిళల రద్దీకి అనుగుణంగా నూతన బస్సుల సంఖ్యను పెంచి డ్రైవర్, కండక్టర్ ఉద్యోగాలు భర్తీ చేయాలని, ఆర్టీసీ కార్మికులకు సంపూర్ణ ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈకార్యక్రమంలో జనరల్ సెక్రటరీ రవికుమార్, అధ్యక్షుడు ఆనంద్‌రెడ్డి, నాయకులు రంజిత్, మధు, మోహన్, కవిత, ప్రభావతి, లలిత, మాధవి, తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

ములుగులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టీఎస్ యూటీఎఫ్) నూతన డైరీ, క్యాలెండర్‌ను మంత్రి సీతక్క ఆదివారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ 317జీవో ద్వారా నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని, బదిలీలు, పదోన్నతులు కల్పించాలని, ప్రతి పాఠశాలలో స్కావెంజర్లను నియమించాలని, పండిట్, పీఈటీల అప్‌గ్రేడేషన్ ప్రమోషన్‌కు అర్హులైన టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని మంత్రిని కోరారు. ఈకార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, ములుగు జిల్లా అధ్యక్షుడు గొప్ప సమ్మారావు, ప్రధాన కార్యదర్శి రెడ్డి వాసుదేవరెడ్డి, నాయకులు పోడియం సమ్మయ్య, జక్కుల వెంకటస్వామి, ములుకాల వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

చేతన ఫౌండేషన్ సేవలు వెలకట్టలేనివి

చేతన ఫౌండేషన్ సేవలు వెలకట్టలేనివని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీశిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. ఆదివారం ములుగులో ఫౌండేషన్ ఆధ్వర్యంలో కృత్రిమ పాదాలకు కొలతల శిబిరం నిర్వహించగా ఆమె ప్రారంభించి మాట్లాడారు. చేతన ఫౌండేషన్ నాలుగేళ్లుగా ములుగు నియోజకవర్గంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడం, కరోనా సమయంలో నిత్యావసర వస్తువులు, విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, గోదావరి వరదల సమయంలో ప్రజలకు దుప్పట్లు, దుస్తులు పంపిణీ చేయడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి.శ్రీజ, అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ ప్రేమలత, చేతన ఫౌండేషన్ సభ్యులు దొడ్డ సీతారామయ్య, ముత్తినేని సురేష్, భూక్య సత్తులాల్, చంద్రకాని, నవీన్, షేక్ రషీద్, దొడ్డపనేని సాంబశివరావు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు యువత కొండంత బలం



మంత్రికి జ్ఞాపికను అందజేస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

ములుగు : కాంగ్రెస్ పార్టీకి యువత కొండంత బలమని, తన గెలుపులో, పార్టీ అధికారంలోకి రావడంలో వారి పాత్ర విలువైనదని మంత్రి సీతక్క అన్నారు. ఆదివారం రాత్రి ములుగులోని డీఎల్ఆర్ గార్డెన్స్‌లో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బానోతు రవిచందర్ ఆధ్వర్యంలో ఆత్మీయ అభినందన సభ జరిగింది. సీతక్కను శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు. మంత్రి మాట్లాడుతూ తన గెలుపుకోసం కృషిచేసిన ప్రతీ కార్యకర్తకు రుణపడి ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, యూత్‌కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనసరి సూర్య, యూత్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణం.. ప్రాణ సంకటం

5వ పేజీ తరువాయి

కిలోమీటర్ల మేర దెబ్బతింది. ద్విచక్రవాహనదారులు ఇది గమనించకుండా ప్రయాణించడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఒకవైపు వాహనాల టైర్లు లాగేసి కిందపడేటట్లు చేస్తున్నాయి. ఇదే క్రమంలో ఎదురుగా, వెనుక నుంచి లారీలు, ఇతర వాహనం వచ్చినా దాని కింద పడి ప్రాణాలు కోల్పోతున్నారు.

ప్రమాదకర మలుపులు

మండల కేంద్రంలోని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి గెస్ట్ హౌస్ మలుపు ప్రమాదకరంగా మారింది. నిత్యం ఇసుక లారీలు ఢీకొని ఇరుక్కుపోతున్నాయి. ఇటీవల ఏటూరునాగారం నుంచి హనుమకొండ వైపు వెళ్తున్న ఇసుక లారీ బ్రేక్ డౌన్ కారణంగా ఆగిపోయింది. అదే క్రమంలో మరో లారీ హనుమకొండ వైపు వెళ్తున్న లారీని ఏటూరునాగారం వైపు వస్తున్న లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఓ లారీ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. దీంతో రెండు లారీలు పక్క పక్కన ఇరుక్కుపోవడంతో వచ్చిపోయే ఆర్టీసీ, ప్రైవేట్ వాహనాలకు సుమారు రెండు గంటల పాటు భారీగా ట్రాఫిక్ ఏర్పడింది.

తాజాగా ఈనెల 26న ఏటూరునాగారంలోని ఐటీడీఏ పీవో గెస్ట్ హౌస్ మలుపు వద్ద రాత్రి 6 గంటల ప్రాతంలో రెండు ఇసుక లారీలు చెడిపోయాయి. దీంతో రాత్రి 11 దాటాక కూడా అవి కదల్లేదు. చెడిపోయిన లారీల ముందు, వెనుక నుంచి వచ్చిన మిగతా లారీలు, ప్రైవేటు, ఆర్టీసీ వాహనాలు ఎక్కడికి అక్కడ నిలిచిపోయాయి. వెంకటాపురం(నూగూరు), వాజేడు మండలాల ఇసుక క్వారీల నుంచి ఏటూరునాగారం మీదుగా హనుమకొండ వైపు వెళ్తున్న ఇసుక లారీలు ఏటూరునాగారం వద్ద జాతీయ రహదారిపై జంపన్నవాగు మొదటి వంతెన వరకు సుమారు 50 నుంచి 60 లారీలు నిలిపోయాయి. దీంతో సుమారు ఆరు గంటల పాటు ఆర్టీసీ, ప్రైవేట్ వాహనాలకు అంతరాయం ఏర్పడడంతో ప్రయాణికులు పడరాని పాట్లు పడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు.

పత్తి కొనుగోలు పేరుతో మోసం



వాహనాన్ని అడ్డగించిన గ్రామస్థులు

రేగొండ, జనవరి 28: మార్కెట్ ధరకంటే రూ. 200 ఎక్కువకు పత్తి కొనుగోలు చేస్తామని చెబుతూ రైతులను మోసం చేసిన సంఘటన గోరికొత్తపల్లి మండలంలోని వెంకటేశ్వర్లపల్లిలో ఆదివారం చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. కోరుట్లకు చెందిన కొందరు వ్యక్తులు రెండు రోజులుగా వెంకటేశ్వర్లపల్లిలో తిరుగుతున్నారు. మార్కెట్ ధరకంటే అదనంగా రూ. 200 చెల్లిస్తామని రైతులను నమ్మబలికారు. దీంతో కొందరు రైతులు శనివారం పత్తి అమ్మారు. ఇదే క్రమంలో ఆదివారం కూడా ఆ వ్యక్తులు గ్రామంలోకి రెండు వాహనాల్లో వచ్చారు. అదే గ్రామానికి చెందిన పనస రాంబాబు కూడా పత్తిని వారికి అమ్మాడు. కాగా తూకంలో ఏదో మోసం ఉందని గ్రహించి ప్రశ్నించగా రెండు వాహనాల్లో లోడ్ అయిన పత్తితో వారు ఉడాయించారు. దీంతో రైతులు వారిని పట్టుకొని నిర్బంధించారు. పోలీసులకు సమాచారం తెలియడంతో నిందితులను అదుపులోకి తీసుకున్నారు. అలాగే చుట్టు ప్రక్కల ఉన్న పోచంపల్లి, కొనరావుపేట, సుల్తాన్‌పూర్ తదితర గ్రామాల్లో కూడా కొనుగోలు చేశారని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిందితులు ఒక ముఠాగా ఏర్పడి రైతులను మోసం చేస్తున్నారని రైతులు తెలిపారు. పనాస రాంబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్టు ఎస్సై రవికుమార్ తెలిపారు.

మంత్రి సీతక్కకు వినతి

ఏటూరునాగారం, జనవరి 28 : మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రోడ్లు సరిగ్గా లేక వర్షాకాలంలో ఇబ్బంది అవుతోందనిరాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్కను డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చిన్న, అధ్యాపకులు ఆదివారం వినతి పత్రాన్ని సమర్పించారు. ప్రిన్సిపాల్ చిన్న మాట్లాడుతూ డిగ్రీ కళాశాలలో ఉన్న సమస్యలపై, చేయాల్సిన అనేక అభివృద్ధి కార్యక్రమాలపై మంత్రికి వివరించారు. ముఖ్యంగా కళాశాల వద్ద ఉన్న జాతీయ రహదారి నుంచి కళాశాల ప్రధాన గేటు వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాలన్నారు. అంతర్గత రోడ్డు నిర్మా ణాన్ని సీసీ రోడ్డుగా చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై మంత్రి సీతక్క సానుకూలంగా స్పందించారు. వెంటనే డిగ్రీ కళాశాల విద్యార్థుల ఇబ్బందులను నెరవేరుస్తానని, కళాశాలలో నెలకొన్ని సమస్యలను తెలుసుకొని విద్యాభివృద్ధికి తోడ్పడుతానని హామీ ఇచ్చారు.

ప్రాణం తీసిన ధాన్యం బస్తాలు

మచ్చాపూర్ వద్ద రోడ్డు ప్రమాదంలో బిల్డర్ మృతి

కారును ఢీకొన్న లారీ.. ముగ్గురికి తీవ్ర గాయాలు

తీర్థయాత్రకు వెళ్లి వస్తుండగా ఘటన



నాగరాజు (ఫైల్)



నుజ్జునుజ్జు అయిన కారు

గీసుగొండ, జనవరి 28: మండలంలోని మచ్చాపూర్ గ్రామ శివారు అపెక్స్ కళాశాల మూలమలుపు వద్ద వరం గల్-నర్సంపేట ప్రధాన రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, కుటుం బీకులు తెలిపిన వివరాల ప్రకారం... నర్సంపేట మండలం రామవరం గ్రామానికి చెందిన జినుకల నాగరాజు(55) భార్య లలిత, కుమారుడు శ్రీకాంత్, కోడలు సింధులతో కలిసి ఈ నెల 26న హనుమకొండలోని రామారం వద్ద గల కూమార్తె ఇంటికి వెళ్లారు. కుమార్తె కొడుకు పుట్టువెం ట్రుకలు తీసేందుకు అక్కడి నుంచి అదే రోజు వేముల వాడకు బయలుదేరి వెళ్లారు. రాజరాజేశ్వర స్వామికి మొక్కులు చెల్లించిన అనంతరం కొండగట్టుకు వెళ్లి ఆంజనేయ స్వామిని దర్శించుకొని శనివారం సాయంత్రం హను మకొండలోని రామారంకు వచ్చారు. కుమార్తె, అల్లుడు, మనవడిని అక్కడ వదిలిపెట్టి స్వగ్రామం నర్సంపేట మండలంలోని రామవరం గ్రామానికి అదే రోజు రాత్రి కారులో నాగరాజు కుటుంబీకులు బయలుదేరారు. ఈ క్రమంలో గీసుగొండ మండలంలోని మచ్చాపూర్ గ్రామ శివారు అపెక్స్ కళాశాల మలుపు వద్దకు రాగానే వరిధాన్యం లోడుతో ఎదురుగా వేగంగా వచ్చిన లారీ అదుపుతప్పి కారును ఢీకొంది. దీంతో లారీపై ఉన్న ధాన్యం బస్తాలు జారి ఒక్కసారిగా కారుపై పడిపోయాయి. కారులో ఉన్న నాగరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. కారు నడుపుతున్న శ్రీకాంత్‌కు చేయి విరిగి, తలకు తీవ్ర గాయమైంది. కారులో ఇరుక్కు పోయిన లలిత, శ్రీకాంత్, సింధు ఏడుస్తూ బిగ్గరగా కేకలు వేయటంతో స్థానికులు, ప్రయాణికులు ఘటనా స్థలానికి చేరుకొని కారుపై నుంచి ధాన్యం బస్తాలను తొలగించి వారిని బయటికి తీశారు. అనంతరం 108 వాహనం ద్వారా ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. నాగరాజు నర్సంపేటలో బిల్డర్‌గా పని చేస్తుండగా, శ్రీకాంత్ నల్లగొండలో ఓ బ్యాంకులో అసిస్టెంట్ మేనేజర్‌గా, సింధు గురిజాలలో ఏఈవో పని చేస్తోంది.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



తాడిచర్లలో ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

మల్హర్, జనవరి 28 : మండల కేంద్రమైన తాడిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. 1995- 96 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు కలుసుకున్నారు. చదువుకున్న సమయంలోని జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. ఎవరో ఏ రంగంలో స్థిరపడ్డారు ఒక్కొక్కరు వివరించారు. ఆటపాటలతో సంబరంగా గడిపారు. అప్పుడు తమకు పాఠాలను నేర్పిన ఉపాధ్యాయులు గట్టు మధుకర్, వానమాముల కృష్ణమాచార్యులు, మల్క భాస్కర్‌రావు, సార్ల రాజయ్య, సుంకరి సారయ్య, మల్క రాంకిషన్‌రావు, కట్కం ప్రకాష్, అంబాల శంకరయ్యను సన్మానించారు.

గోవిందరావుపేట కాలేజీలో...

గోవిందరావుపేట : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1984-85, 1985-86 సంవత్సరాల్లో ఇంటర్మీడియట్ పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు ఆదివారం కళాశాల ఆవరణలో సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమం ముందుగా ఇటీవల అనారోగ్యంతో చనిపోయిన తోటి మిత్రులు, అధ్యాపకుల ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈసందర్భంగా పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని గత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం పూర్వ అధ్యాపకులు రామనాథం మల్లికార్జున్, సుధాకర్, జవహర్‌లాల్, సురేందర్, వెంకటనర్సయ్యలను శాలువాలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



గోవిందరావుపేట సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు

తునికాకు టెండర్లు పూర్తి చేయాలి

సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు రవి కుమార్ డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు రవి కుమార్

గోవిందరావుపేట, జనవరి 28: వేసవిలో తునికాకు సేకరణ గిరిజ నులకు రెండో పంటగా ఉన్నందున టెండర్లు పూర్తి చేసి 50 ఆకుల కట్టకు రూ.4 చెల్లించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు బండారు రవి కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని పస్రాలో ఆదివారం రత్నం రాజేందర్ అధ్యక్ష తన పార్టీ జిల్లా కమిటీ సమావేశం జరగగా ఆయన పాల్గొని మాట్లాడారు. 2016 నుంచి 2021 వరకు తునికాకు బోనస్ రూ.200కోట్లను ప్రభుత్వం గతంలో విడుదల చేసిందని, వాటిని మేడారం జాతరలోపు కూలీలకు అందజేయాలని డిమాండ్ చేశారు. వెంటనే ప్రభుత్వం తునికాకు ప్రక్రియ చేపట్టాలని, బోనస్ మంజూరు చేయాలన్నారు. లేనట్లయితే ఆందోళన కార్యక్రమాలు పెద్దఎత్తున చేపడతామని హెచ్చరించారు. ఈసమావేశంలో నాయకులు బీరెడ్డి సాంబశివ, ఎమ్డీ.అమ్జద్‌పాషా, వంకా రాములు, గొంది రాజేష్, పొదిళ్ల చిట్టిబాబు, రమాదేవి, ఎమ్డీ.గఫూర్‌పాషా, దుగ్గి చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

మూడు ఇసుక లారీల పట్టివేత

ఏటూరునాగారం, జనవరి 28 : ఓవర్ లోడుతో వెళ్తున్న మూడు ఇసుక లారీలను స్థానిక పోలీసులు శనివారం రాత్రి పట్టుకున్నారు. వెంకటాపురం(నూగూరు) మండలం వైపు నుంచి ఏటూరునాగారం చెక్ పోస్ట్ మీదుగా హనుమకొండ వైపు అధిక లోడుతో లారీలు వెళ్తుండగా వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్‌కు అవి తారసపడ్డాయి. నిబంధనలకు విరుద్ధంగా అధిక లోడుతో వెళ్తుండటంతో లారీలను స్వాధీనం చేసుకున్నారు.

ఎంపీ టికెట్ మాదిగలకు కేటాయించాలి : ఎమ్మార్పీఎస్

మల్హర్, జనవరి 28 : పెద్దపల్లి పార్లమెంట్ ఎంపీ టికెట్‌ను మాదిగలకే కేటాయించాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కేసారపు నరేష్ డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన తాడిచర్లలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్ని ప్రధాన పార్టీలు పెద్దపల్లి పార్లమెంట్ ఎంపీ టికెట్‌ను మాదిగలకే కేటాయించాలని డిమాండ్ చేశారు. పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో అధిక సంఖ్యలో ఉన్న మాదిగల వర్గానికే కేవలం ఒకే సారి మాత్రమే అవకాశం వచ్చిందని, ఈసారి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.

మహదేవపూర్ సీఐ బదిలీ

మహదేవపూర్, జనవరి 28: మహదేవపూర్ సీఐ కిరణ్ బదిలీ అయ్యారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లికి ఆయన్ను బదిలీ చేస్తూ పోలీసు శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన స్థానంలో మహదేవపూర్‌కు ఎవరినీ ఇంకా నియమించలేదు.

నేడు మంత్రి శ్రీధర్‌బాబు రాక

కాటారం, జనవరి 28: రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మండలంలో సోమవారం పర్యటించనున్నారు. మండలంలోని వీరాపూర్ గ్రామపంచాయతీలో అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారు. సుమారు రూ.41లక్షల డీఎంఎఫ్‌టీ నిధులతో నిర్మించిన గ్రామపంచాయతీ, అంగన్‌వాడీ భవనాలను మంత్రి ప్రారంభించనున్నారని ఎంపీపీ సమ్మయ్య తెలిపారు. మండలంలో వివిధ సమస్యలపై అధికారులతో మంత్రి మాట్లాడతారని వెల్లడించారు.

- మల్హర్: మంత్రి శ్రీధర్‌బాబు మండలంలో సోమవారం పర్యటించనున్నారు. మండల కేంద్రమైన తాడిచర్ల, అడ్వాలపల్లిలో నూతనంగా నిర్మాణం చేపట్టిన గ్రామపంచాయతీ భవనాలను ప్రారంభించనున్నారు.

మహనీయుల ఆశయ సాధనకు కృషి

ఆల్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు శంకర్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న లింగమల్ల శంకర్ తదితరులు

కాటారం, జనవరి 28: మెరుగైన సమాజం కోసం మహనీయుల ఆశయ సాధనకు కృషి చేయాలని ఆల్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు లింగమల్ల శంకర్ అన్నారు. సంఘం జోనల్ కమిటీ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 11న కొయ్యూరులో నిర్వహించనున్న జోనల్ స్థాయి సమావేశం, రమా బాయి అంబేద్కర్ 126వ జయంతి పోస్టర్లను మండల కేంద్రంలోని ఓ డిగ్రీ కాలేజీ ఆవరణలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ అంబేద్కర్, పూలే, రమాబాయి వంటి మహనీయుల ఆలోచన విధానాలను ఆచరిస్తూ సమాజానికి మంచి చేయాలనే ఉద్దేశంతో సొసైటీ పనిచేస్తోందని అన్నారు. సమాజం నుంచి ఎన్నో విధాలుగా లబ్ధి పొందిన దుకు పే బ్యాక్ టు సొసైటీ అనే కాన్సెప్ట్‌తో ప్రజలకు సహాయం చేయడానికి కృషి చేయాలన్నారు. జోనల్ స్థాయి సమావేశానికి అధిక సంఖ్యలో విచ్చేసి విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఏఈడబ్ల్యూఎస్ జోనల్ అధ్యక్షుడు గంట రాజబాపు, చింతల కుమార్ యాదవ్, బండి సుధాకర్, దుప్పటి ప్రవీణ్, కందుగుల రాజన్న, బొడ్డు రాజబాబు, వడ్లకొండ రాజయ్య, మౌలానా తదితరులు పాల్గొన్నారు.